శ్మశానాలకు ప్రహరీలు

● మున్సిపల్ కమిషనర్ మౌర్య

జీవకోనలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్న నేపథ్యంలో 150 మంది అదనపు సిబ్బంది నియమిస్తామని మున్సిపల్ కమిషనర్ మౌర్య ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. దీన్ని పదిహేను రోజుల్లో అమలు చేస్తామన్నారు. శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరగా టెండర్లు పిలుస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా జీవకోనతో సహా నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఇక్కడ రోడ్లపై గోతులు పూడ్చడంపై దృష్టి పెడతామన్నారు. జీవకోన ప్రాంతంలోని ప్రతి వార్డులోనూ స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుంటామని, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం కాలువల్లో ఎవరూ ప్రమాదవశాత్తూ పడిపోకుండా కాలువలపై ఇనుప గ్రిల్ అమర్చుతామని, ఆ కాలువల్లో సిమెంట్ లైనింగ్ తొలగించే విషయమై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామన్నారు. పట్టా, అనుభవ పత్రం, స్థలం వున్న వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.



జీవకోనలో ప్రతిధ్వనించిన ప్రజాగళం

పోలీసు ఔట్ పోస్టు

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

అసాంఘిక శక్తుల సంచారాన్ని, మత్తు పదార్థాల వినియోగంపై తక్షణం ఉక్కుపాదం మోపుతామని అందులో భాగంగా జీవకోనలో పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయిస్తామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రకటించారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు నిర్దిష్టమైన హామీ ఇచ్చారు. అలాగే జీవకోన ప్రాంతంలో ప్రజలకు శుద్ధి చేసిన జలాలను అందించడానికి తన కుటుంబానికి చెందిన జేఎంసీ ట్రస్టు ద్వారా రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రెండు నెలల్లో వీటిని పూర్తి చేసి ఉచితంగా తాగునీరు అందిస్తామన్నారు. పదిహేను రోజుల్లో జీవకోనలో అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. జీవకోనలో భూములు అటవీ శాఖ, కాలువ పోరంబోకు కేటగిరీలో వున్నందున స్థానికులు కట్టుకున్న ఇళ్ళకు పట్టాలు మంజూరు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అటవీ శాఖ అనుమతుల కోసం ప్రయత్నిస్తామని, సాధ్యం కాకుంటే అనుభవ పత్రాలు ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. జీవకోనలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామన్నారు. రామాపురం రిజర్వాయర్ నుంచీ పైపులైన్ల ద్వారా జీవకోనలో నీరులేని ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. తిరుపతి, తిరుమలలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశించారని గుర్తు చేసిన ఎమ్మెల్యే, టీటీడీ నుంచీ రూ. 45 కోట్లు నిధులు తెప్పించి రిజర్వాయర్ నిర్మాణానికి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కపిలతీర్థం నీటిని నిల్వ చేసేందుకు రూ. వంద కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించే ప్రతిపాదనపై టీటీడీ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారని, దానికోసం ప్రయత్నిస్తామన్నారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం మిగులు నీటిని వినాయక సాగర్‌కు మళ్ళిస్తామని, మురికి నీరు వినాయక సాగర్‌లో కలవకుండా చూస్తామన్నారు. జీవకోనలో యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రైవేటు ఉద్యోగాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీవకోనలో మురికి నీటి కాలువను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామని, సత్యనారాయణపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

6లో ప్రజా స్వరం

● మౌళిక వసతుల కొరత మొదలు, సామాజిక సమస్యల దాకా ప్రస్తావించిన ప్రజలు ● భారీగా హాజరైన స్థానికులు ● పెద్ద సంఖ్యలో మహిళలు
● పలు అంశాలపై విస్పష్ట హామీలిచ్చిన ఎమ్మెల్యే, కమిషనర్ ● విజయవంతంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' సదస్సు

ఆంధ్రజ్యోతి అండగా.. తిరుపతి నగరంలోని జీవకోన ప్రజలు తమ సమస్యలపై గొంతు విప్పారు. మంగళవారం ఉదయం జీవకోనలోని అంబేడ్కర్ సర్కిల్‌లో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' నినాదంతో మంగళవారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సదస్సులో మౌళిక వసతుల కొరత నుంచీ శాశ్వత సమస్యల దాకా ప్రజాగళం ప్రతిధ్వనించింది. భారీగా హాజరైన స్థానికులు, ప్రత్యేకంగా తరలివచ్చిన మహిళలు నిత్యం తామెదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. రెండు గంటల పాటు జరిగిన సదస్సులో బాధిత జనం వెతలు విన్న ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య వాటిలో పలు సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన హామీలిచ్చారు. సదస్సుకు హాజరైన కార్పొరేషన్, రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకూ, అధికార యంత్రాంగానికీ, ప్రజాప్రతినిధులకూ వారధిగా ఆంధ్రజ్యోతి చేసిన ఈ ప్రయత్నాన్ని అతిథులు అభినందించగా, సదస్సుకు హాజరైన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జీవకోన జనం చెప్పిన సమస్యలు

● జీవకోన ప్రాంతం శేషాచల పర్వత పాద భాగంలో వుండడం వల్ల నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మిట్ట ప్రదేశం. దీంతో ఎత్తు ప్రాంతానికి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. శాశ్వత పరిష్కారంగా జీఎస్ఎల్ఆర్ నిర్మాణం చేపట్టాలి. తాత్కాలికంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టాలి.

● తిరుమల గిరుల్లో కురిసే వర్షపు నీరు మాల్వాడిగుండం చేరి అక్కడి నుంచీ జీవకోన మీదుగానే దిగువకు వృధాగా వెళుతున్నాయి. ఆ కాలువకు సిమెంట్ లైనింగ్ వేయడంతో నీరు భూమిలోకి ఇంకడం లేదు. సిమెంట్ లైనింగ్ తొలగిస్తే నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు రీఛార్జి అవుతాయి. ఎగువన చెక్‌డ్యాం నిర్మించి నీటిని నిల్వ చేసుకోవచ్చు. ● కాలువలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదవశాత్తూ కాలువల్లో పడిపోయి ఇప్పటి వరకూ ఐదుగురు మరణించారు. ఎత్తైన గోడలు నిర్మించాలి.

● సత్యనారాయణపురం, అమెరికన్ బార్ కూడళ్ళలో రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఫుట్ పాత్‌ల ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరించడంతో పాటు కీలక సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని నియమించాలి.

● జీవకోనలో ప్రధాన వీధుల్లో మురికి నీటి కాలువలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా తిరుమల కొండల నుంచీ నీరు వచ్చి ఇళ్ళలోకి చేరుతున్నాయి. దీన్ని నివారించేందుకు మురికి నీటి కాలువలు నిర్మించాలి.

● జీవకోనలో అనేక వీధుల్లో రోడ్లు పాడైపోయి ఉన్నాయి. వీటిని నిర్మించాలి.

● పక్కపక్కనే వేర్వేరుగా వున్న మూడు మతాలకు చెందిన స్మశానాలకు ప్రహరీలు లేవు. గేట్లు లేవు. దీంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు వేదికలవుతున్నాయి. కొందరు యువకులు గంజాయి, డ్రగ్స్, మద్యం సేవించి ఈ ప్రాంతాల్లో ప్రమాదకరంగా సంచరిస్తున్నారు. నిరోధించేందుకు పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలి.

● జీవకోనలో యువతకు తగిన జీవనోపాధి లేకపోవడంతో కొందరు జులాయిగా తిరుగుతూ గంజాయి సేవనానికి అలవాటు పడుతున్నారు. యువతకు ఉపాధి కల్పించడంతో పాటు డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగాలపై ఉక్కుపాదం మోపాలి.

● జీవకోనలో కుక్కల బెడద ఎక్కువైంది. నిర్మూలనపై దృష్టి పెట్టాలి.

● పలు ప్రాంతాల్లో మురికి కాలువలను రోజుల తరబడీ శుభ్రం చేయడం లేదు. దోమలు ప్రబలుతున్నాయి. రోగాలు పెరుగుతున్నాయి.

● జీవకోనలో ప్రధానంగా నివసిస్తున్నది పేదలు, కూలీలు, చిరు వ్యాపారులు. సెంటు కంటే తక్కువ స్థలంలో ఇళ్ళు కట్టుకుని ఉంటున్నారు. చాలామందికి పట్టాలు లేవు. అలాగే సొంత స్థలాలు, ఇళ్ళు లేని వారూ ఎక్కువే. ఇళ్ళు వున్న వారికి పట్టాలు లేదా అనుభవ పత్రాలు ఇవ్వాలి. ఇళ్ళు లేని వారికి పక్కా ఇళ్ళు, స్థలాలు లేని వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి.

తిరుపతి నగరం జీవకోనలో మంగళవారం ఉదయం 10.30కి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సదస్సు ప్రారంభం అయ్యింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మౌర్య ముందుగా ఆ ప్రాంతంలోని వీధుల్లో తిరుగుతూ కాలువలు, రోడ్ల స్థితిని స్వయంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ నీటి సరఫరా, పారిశుధ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. విశిష్ట అతిథి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడలిలోని అండేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అతిథులుగా 48, 49 డివిజన్‌ల కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పి.కుమారమ్మ పాల్గొన్నారు. వీరు జీవకోన విశిష్టతను వివరిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా ఎమ్మెల్యేని, కమిషనర్‌ను కోరారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామసుందర్, డిసిపి మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజనీర్ గోమతి, ఆర్‌వోలు సేతుమాధవ్, రవి, డీఈ రమణ, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి హాజరయ్యారు.

తిరుపతి నగరంలోనే అత్యంత విశాలమైన కాలనీగా ఉన్న జీవకోనలోని రోడ్లు వాన కురిస్తే మడుగుల్లా మారుతున్నాయని, తిరుమల కొండలమీద కురిసిన నీళ్లంతా జీవకోన మీదుగానే కిందికి పారుతున్నా, తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని, కాలువల్లో మురికి పేరుకుపోయి దోమల ఆవాసాలుగా మారుతున్నాయని జీవకోన వాసుల్లో ఎక్కువ మంది ప్రధానంగా సదస్సుల్లో తెలియజేశారు. 35 ఏళ్లుగా నివాసం ఉంటున్నా శాశ్వత ఇళ్లపట్టాలు లేవని, డీకేటీలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై స్పందించిన కమిషనర్ ఎన్.మౌర్య అక్కడి కక్కడే కొన్ని సమస్యలపై నిర్ణయాలు ప్రకటించారు. జీవకోన అభివృద్ధికి తాము చేస్తున్న ప్రయత్నాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వివరించారు. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన అర్జీలను సదస్సుత తర్వాత కూడా ఎమ్మెల్యే ఓపికగా స్వీకరించారు. వారి సమస్యలను విని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జీవకోనలో చాలా మంది చదువుకున్నా పనులు లేక వ్యసనాలకు బానిసలైపోతున్నారంటూ ఒక తల్లి వ్యక్తం చేసిన ఆవేదన అందరినీ కదిలించింది. గంజాయి బ్యాచ్‌లతో రాత్రిళ్లు భద్రత లేకుండా పోతోందన్న మహిళల మాటలకు స్పందించిన ఎమ్మెల్యే అక్కడ పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 300 మందికి పైగా జీవకోన ప్రజలు హాజరైన సదస్సు పరిష్కార దిశగా విజయవంతంగా ముగిసింది. సదస్సులో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఆంధ్రజ్యోతి ప్రజల వెంట ఉంటుందని,అధికారులకు, ప్రజాప్రతినిధులకు గుర్తు చూస్తూనే ఉంటుందని ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి ముఖ్య అతిథులను వేదికమీదకు ఆహ్వానించగా, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు సదస్సు ఉద్దేశ్యాన్ని వివరించి, సభను నిర్వహించారు. ఆంధ్రజ్యోతి తిరుపతి ఎడిషన్ ఇన్‌చార్జి సుధాకరబాబు, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, ఏడీవీటీ మేనేజరు ఈశ్వరనాయుడు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజరు ఉమాపతి, ఆంధ్రజ్యోతి సిబ్బంది సదస్సు నిర్వహణను పర్యవేక్షించారు. ఆంధ్రజ్యోతి తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ నరేంద్ర సదస్సును విజయవంతం చేసిన అతిథులకు, హాజరైన జీవకోన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సదస్సులో జనసేన పార్టీ నేతలు రాజారెడ్డి, బాబ్జీ, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచారి, టీఎన్‌టీయూసీ నేత లక్ష్మీపతి నాయుడు, టీడీపీ నేత గోళ్ళ లోకేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి సుప్రభాత వేళ..

షార్‌లో శత ప్రయోగ సందడి



ప్రయోగ వేదికపై రాకెట్

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సూర్యోదయ వేళ ఇస్రో వందో రాకెట్ ప్రయోగం జరపనుంది. ఉదయం 6.23 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. ఈ రాకెట్ ద్వారా నావిగేషన్ సేవలకు సంబంధించిన నావిక్-02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు. షార్ నుంచి సెంచరీ ప్రయోగం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇటు శాస్త్రవేత్తలు, ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్ చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిగమ్నమై ఉన్నారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు ప్రారంభమై నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఈ ఏడాది షార్ నుంచి ఇది తొలి ప్రయోగం.

ప్రయోగం @ 19.17 నిమిషాలు

151 సెకన్లకు మొదటి.. 294 సెకన్లకు రెండో దశ.. 1,140 సెకన్లకు కీలకమైన మూడోదైన క్రయోజనిక్ దశకు రాకెట్ చేరుకుంటుంది. ఆ తర్వాత రాకెట్‌లోని నావిక్-02 ఉపగ్రహాన్ని 170 కిలోమీటర్ల దూరంలో భూమికి దగ్గరగా (పెరిజి) 36,577 కిలో మీటర్ల దూరంగా (అపోజి) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెడతారు. ప్రయోగం మొత్తం 19.17 నిమిషాలకు పూర్తయ్యేలా శాస్త్రవేత్తలు రాకెట్‌ను డిజైన్ చేశారు.



ముక్కంటికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ దర్శించుకున్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాకెట్ నమూనాను స్వామి పాదాల చెంత ఉంచి పూజలు చేయించారు.

చంద్రగిరి

రథసప్తమి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): రథసప్తమికి జన రద్దీని అంచనా వేసుకుని ముందుగా తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలో ఫిబ్రవరి4న జరుగనున్న రథసప్తమి ఏర్పాట్లపై అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో ఇంచార్జ్ మణికంఠ చందోలుతో కలిసి పాల్గొన్నారు. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. రథసప్తమి రోజున ట్రాఫిక్, పార్కింగ్, అత్యవసర టీంలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమగ్ర బందోబస్తుపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఘాట్‌రోడ్డు వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా సమన్వయం చేసుకోవాలన్నారు. అంతకుముందు శ్రీవారిమెట్టు టోకెన్లపై కూడా అధికారులతో మాట్లాడారు. ఈ సమీక్షలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు వర్చువల్‌గా, నేరుగా సీఈ సత్యనారాయణ, అదనపు ఎస్పీ రామకృష్ణ, జీఎం శేషారెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన


నరసింగాపురంలో పశువులకు వైద్య సేవలు

చంద్రగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని నారావారిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ వంశీ చెప్పారు. మంగళవారం నరసింగాపురంలో శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఇప్పటివరకూ 20 గ్రామాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. 5,068 పశువులకు సాధారణ చికిత్సలు చేశామన్నారు. అందులో 345 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, చూడి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నట్టల నివారణలో భాగంగా ఆవులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు 5487 డోసుల మందు వేశారన్నారు. 470 గొర్రెలు, మేకలకు టీకాకాలు వేసినట్లు పేర్కొన్నారు. శిబిరంలో సర్పంచ్ చెంచురత్నం, ఎంపీటీసీ అశ్వనీప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారుల భద్రతపై విద్యార్థులకు అవగాహన

చంద్రగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో పనపాకం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి కె.భాస్కర్ బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు వాహనాలు నడిపేందుకు అర్హులన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుపురుషోత్తంరెడ్డి, రహదారుల భద్రత మేనేజర్ శ్యాం ప్రశాంత్, ఇన్సిడెంట్ మేనేజర్ వినోద్, ,నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా క్యూట్ స్టాఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగుల బీభత్సం


మామిడితోటలో ఏనుగుల విధ్వంసం

చంద్రగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యల్లంపల్లి, కొండ్రెడ్డికండ్రిగ గ్రామాల్లోని పంటపొలాల్లో సోమవారం అర్ధరాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. 12 ఏనుగులు అటవీ ప్రాంతం నుంచి వచ్చి 20మందికి చెందిన మామిడి, అరటి, వరి పంటలతోపాటు, వ్యవసాయి బావి మోటార్లు, ఫెన్సింగ్‌లు, పైపులను ధ్వంసం చేశాయి. ఈనెల 18న ఏనుగుల దాడిలో కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గ్రామస్తులు తలుపులు వేసుకుని బిక్కు బిక్కుమంటున్నారు. ఎఫ్ఆర్వో మాధవి, ఎఫ్ఎస్వో అనిత, డీఆర్వో చినబాబు, ఎఫ్‌బీవోలు చిత్ర, రెడ్డప్ప, యుగంధర్, ప్రొటెక్షన్ వాచర్స్ మురళి, మునిరాజులు వీటి కట్టడికి చేపట్టారు. రాత్రివేళ పొలాల వద్దకు వెళ్ళకూడదని అవగాహన కల్పించారు.

విదేశీ జెండాతో తిరుమలకు వ్యాన్



తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): విదేశీ జెండాతో ఓ వ్యాన్ తిరుమలకు రావడం చర్చనీయాశంమైంది. ఇతర దేశాల జెండాలతో రాకూడదనే నిబంధన లేకపోయినప్పటికీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వాటిని కూడా టీటీడీ కొన్నేళ్లుగా తొలగిస్తూ వస్తోంది. మంగళవారం టీఎన్ 11 క్యూ 8853 నెంబరు గల టెంపో ట్రావెలర్ వాహనం ముందు ఇంజిన్‌పై అమెరికా జెండాతో తిరుమలకు వచ్చింది. దీంతో భక్తులు ఆశ్చర్యంగా చూశారు. ఈ అంశంపై కథనాలు రావడంతో స్పందించిన విజిలెన్స్ అధికారులు వెంటనే వాహనం వద్దకు చేరుకుని జెండాను తొలగించారు. తెలియక వచ్చేశామని, అలిపిరిలో కూడా అడ్డుకోలేదని విజిలెన్స్ అధికారులకు డ్రైవర్ చెప్పారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావును కోరారు. మంగళవారం సదరన్ డిస్కం కార్యాలయంలో కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నాయకులు కుమార్, రవి, రాజు, భార్గవ్, ప్రసాద్, టి.కుమార్ పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

తిరుపతి, జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరానికి తాగునీరు అందించే పైప్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 30వ తేదీ గురువారం నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరానికి నీటి సరఫరా చేయు తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్సు మెయింటెనెన్సు చేయుటలో భాగంగా రామాపురం పంప్ హౌస్ నుంచి బత్తనయ్య కాలనీ వరకు, అనాసంపల్లి మంగళం పంపింగ్ స్టేషన్ ఎదురుగా మెయిన్ పైపులైన్లు మరమ్మత్తులు చేపడుతున్నట్లు చెప్పారు.

బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి

చంద్రగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తొండవాడలో వ్యవసాయి బావిలో అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన గోపికృష్ణనాయుడు(56) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం జగ్గారెడ్డికి చెందిన వ్యవసాయి బావిలో మోటారు అమర్చుతుండగా ఇతడు మృతి చెందాడు. స్థానికులు అతని మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీశారు. అయితే గోపికృష్ణనాయుడు ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడ్డడా లేక విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడో తెలియలేదు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీని ఢీకొన్న వ్యాను

● క్లీనర్ మృతి, డ్రైవర్‌కి గాయాలు

చంద్రగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మామండూరు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం రాత్రి ఆగివున్న లారీని బొలేరు వ్యాను ఢీకొని క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రామచంద్రాపురం మండలం వేపుకుప్పం పంచాయతీ కూనేపల్లెకు చెందిన వెంకటేష్(49) చంద్రగిరి దాసరివీధిలో ఉంటున్నాడు. చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. అలాగే షాపు యాజమాన్యానికి చెందిన బొలెరో వ్యానులో క్లీనరుగా కూడా పనిచేసేవాడు. సోమవారం అర్ధరాత్రి బంగారుపాలెం నుంచి కోళ్ళను తీసుకొస్తున్న బొలెరో వ్యాను మామండూరు వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఢీ కొంది. దీంతో వ్యానులో క్లీనర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ షణ్ముగానికి తీవ్ర గాయాలయ్యాయి.

వాహనదారులకు జరిమానా

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి):నిబంధనలను పాటించిన ట్యాక్సీ డ్రైవర్లకు ఆర్టీవో అధికారులు జరిమానా విధించారు. తిరుమలలోని జీఎన్సీ వద్ద మంగళవారం ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ఎంవీఐ శ్రీనివాసులు తనిఖీలు నిర్వహించారు. పత్రాలను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి రూ.47,500 జరిమానా విధించారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రూ.కోటి మంజూరు

● అడిగిందేమో రూ.6.12 కోట్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మొత్తంలో నిధులు మంజూరు చేసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు రూ.6.12 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం గతేడాది నవంబరులోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఉత్సవాలు ముగిశాక ఇపుడు ప్రభుత్వం కేవలం రూ. కోటి మాత్రమే మంజూరు చేసింది.

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'సామంచి' బాధ్యతల స్వీకరణ

తిరుపతి(వైద్యం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా సామంచి శ్రీనివాస్ బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ నేతలు వరప్రసాద్, దీపక్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన సామంచి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు సుబ్బుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించాలి


వినతిపత్రమిస్తున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు అలిపిరి వద్ద ఇంటి స్థలాలు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన మంగళవారం టీటీడీ పరిపాలనా భవనంలోని ఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అలిపిరి నుంచి పేరూరు వరకు సర్వేనంబరు 406లో 400 ఎకరాల టీటీడీ భూములు ఉన్నాయని.. ఆ భూములను టీటీడీలో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి 5 సెంట్ల చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో పుత్తూరు సమీపంలో ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేసి ఉద్యోగుల నుంచి డిపాజిట్ కింద తీసుకున్న రూ.3.20 లక్షల నగదును తిరిగి చెల్లించాలన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం : భూమన

తిరుపతి (జీవకోన), జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతులకు, మహిళలకు, విద్యార్థులకు ఇస్తానన్న ఆర్థికసాయంపై మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు పాల్గొన్నారు.

హరిత విప్లవంతో ఆరోగ్యానికి ముప్పు

● ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ ఆందోళన



సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హరిత విప్లవం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతోందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో ఐదు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలేకర్ పాల్గొని ప్రసంగించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో దిగుబడి పెరిగినా క్యాన్సర్, షుగర్, గుండె వ్యాధులకు ఇది కారణమవుతోందన్నారు. జన్యుపరమైన వంగడాల వల్ల నైట్రోజన్, ఆక్సిజన్ కలసి వాతావరణం ప్రభావితమవుతోందన్నారు. తద్వారా వరదలు, కరవులు, తుపానులు, కాలుష్యం పెరుగుతున్నాయన్నారు. మరో పక్క ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల అల్ట్రా వైలెట్ కిరణాలు వ్యవసాయ ఉత్పత్తుల్లోని సత్తువను దెబ్బతీస్తున్నాయన్నారు. మూడు నుంచీ ఐదు లేయర్ల పంట విధానాన్ని పాటించడమే దీనికి పరిష్కారమన్నారు. కృత్రిమ ఎరువుల స్థానంలో గో ఆధారిత పాంచగవ్య, సహజ ఎరువులను వాడాలన్నారు. ఎమ్మెల్యే మురళీ మోహన్, శాప్ చైర్మెన్ రవినాయుడు, ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులు ప్రసంగించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, సేవ్ సంస్థ ప్రతినిధి విజయరామ్, ప్రిన్సిపాళ్ళు నరసయ్య, శ్రీనివాస్, సుధారాణి, వర్డ్ ప్రతినిధి గంగాధర్, కృష్ణ హరీష్, పత్తిపాటి వివేక్ చౌదరి, చంద్ర, వేణు తదితరులు పాల్గొన్నారు.

రూ.90 కోట్లతో చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

పాకాల మండల మీట్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ.90 కోట్లతో చెరువులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. రూ.కోటితో ఆనందగిరి ఆలయ రహదారి, రూ.12కోట్లతో దామలచెరువు, మొగరాల, కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. పదిపుట్లబైలు, రంగంపేట రోడ్డు విస్తరణకు 4.08కోట్లు మంజూరయ్యాయన్నారు. నేండ్రగుంట-పెనుమూరు రోడ్డు విస్తరణకు ప్రతిపాదించామన్నారు. పొలాల్లోని టేకు, వేపచెట్లు సొంత అవసరాలకోసం తీసుకెళ్లడానికి రైతులకు అనుమతి ఇవ్వాలని ఎమ్మార్వోను కోరారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పాకాల మండలానికి నీళ్ల తీసుకురావడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మండల మీట్‌కు ఫారెస్ట్ అధికారులు హాజరు కాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొగరాలలో గంజాయి విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. జడ్పీటీసీ పద్మజరెడ్డి, ఎంపీడీవో అరుణ, తహశీల్దార్ సంతోష్‌సాయి, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయంలో శుద్ధి చేస్తున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పురస్కరించుకుని పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) జరిగింది. ఉదయం 6 నుంచి 9గంటల వరకు అర్చకులు, అధికారులు, పరిచారకులు ఆలయ లోపం నీటితో శుద్ధి చేశారు. సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమంతో ప్రోక్షణం చేశారు. ఈ సందర్భంగా పలు సేవలను రద్దు చేశారు. హైదరాబాద్‌కు చెందిన వెంకటరామప్రసాద్ శర్మ దంపతులు 8 పరదాలను కానుకగా అందజేశారు. శుద్ధి కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


గాయని సునీత

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు ధర్మరాజు, గణబాబు, ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, సినీ గాయని సునీత ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ముక్తికి భగవన్నామస్మరణే మార్గం

● పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ



: విశ్వప్రసన్నతీర్థ స్వామిజిని సన్మానిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): భగవన్నామస్మరణే ముక్తికి మార్గమని ఉడిపికి చెందిన పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజి ఉద్ఘాటించారు. పురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్థానమండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామిజీ మంగళాశాసనాలు అందిస్తూ భగవంతుని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయన్నారు., ఈకోవకు చెందిన పరమభక్తుడు పురందరదాసు అన్నారు. కొక్కె సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్నతీర్థ స్వామిజీ, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడారు. అనంతరం స్వామీజీలను సన్మానించారు. జేఈవో వీరబ్రహ్మం, ఆనందతీర్థాచార్యులు, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే ఆర్థిక ప్రగతి

రామచంద్రాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కుప్పంబాదూరు గ్రామీణ బ్యాంకు మేనేజరు శ్రీరాములు అన్నారు. కాలేపల్లిలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ మహిళ చదువుకున్నప్పుడే ఇల్లు అభివృద్ధి చెందుతుందన్నారు. పొదుపు సంఘాల మహిళలు తప్పనిసరిగా అక్షరాలు నేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘమిత్రలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానీని కలిసిన సామంచి శ్రీనివాస్

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తన ప్రమాణ స్వీకారోత్సవానికి తప్పకుండా రావాలని ఎమ్మెల్యే పులివర్తి నానిని బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సామంచి శ్రీనివాస్ ఆహ్వానించారు. మంగళవారం రఘునాథ్ రిసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో నానిని కలిసి సత్కరించారు. బుధవారం జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితుడుగా రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మతో కులవృత్తులకు ప్రోత్సాహం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి అవగాహన నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ కులవృత్తులు చేసేవారు పేర్లు నమోదు చేసుకుని శిక్షణ పొందిన వారికి ఆయా వృత్తులకు సంబంధించిన పరికరాలను ప్రోత్సాహంగా అందజేస్తామన్నారు. శిక్షణ పొందినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎల్డీఎం విశ్వనాథరెడ్డి,జిల్లా పరిశ్రమల అధికారి రామమూర్తి, ఏడీ మూర్తి, ఏపీడీ ప్రభావతి పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే చంద్రబాబు లక్ష్యం : సుగుణమ్మ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే చంద్రబాబు, లోకేశ్ లక్ష్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తిరుపతి నియోజకవర్గ ఇంచార్జ్ సుగుణమ్మ అన్నారు. మంగళవారం ఆమె నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. జగన్ నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి వెలుగులు తీసుకురావడానికి తండ్రీకొడుకులు చేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. బ్రాండ్ ఏపీగా ఉన్న రాష్ట్రాన్ని జగన్ బిల్డప్ ఏపీగా మార్చారని విమర్శించారు. ఇప్పటికే రూ.5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, 40 వేల యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. చంద్రబాబును విమర్శించే అర్హత, హక్కు భూమన కరుణాకర్ రెడ్డికి లేదని ఆమె పేర్కొన్నారు. నాయకులు చినబాబు, ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, దంపూర్ భాస్కర్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, బీజీ కృష్ణ యాదవ్, లక్ష్మీపతి నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆనంద్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెలెస్త్రా-25

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో సెలెస్త్రా-25 ఘనంగా నిర్వహించారు. ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు మంగళవారం ప్రారంభించారు. ప్రతిభా, సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గోవిందరాజస్వామి అధ్యయనోత్సవాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆలయంలో స్వామి వారి అధ్యయనోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 20వ తేదీ వరకూ అధ్యయనోత్సవాలు కొనసాగుతాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

టీటీడీ రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో టీటీడీ నిర్వహణలో ఉన్న రుయా ఆస్పత్రి సర్కిల్ నుంచి అన్నారావు సర్కిల్, కపిలతీర్థం నుంచి లీలామహల్ సర్కిల్, మంగళం రోడ్డు, లక్ష్మీపురం సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. 19 రోడ్లలో పలు చోట్ల గుంతలు పడి ఉండటంతో పాటు ఫుట్ పాత్‌లు ఆక్రమణలు జరిగి ఉండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. రోడ్లు మరమ్మతు పనుల పూర్తికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. భక్తులకు, స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా రోడ్లను తయారు చేయాలని కోరారు. టీటీడీకి చెందిన సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లతో పాటు ఇతర శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

సబ్జి కూలర్ ప్రయోజనాలు పొందండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు పండించిన కూరగాయలు భద్రపరచుకోవడానికి కూటమి ప్రభుత్వం సబ్జి కూలర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి రైతు బజారులో మంగళవారం ప్రదర్శించింది. ఈ సబ్జి కూలర్ విద్యుత్ సరఫరా లేకుండా పనిచేస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామయ్య తెలిపారు. సబ్జి కూలర్ ప్రయోజనాలను ఆయన మహిళలకు వివరించారు. మహిళా రైతు ధర్మక్క ఒక కూలర్‌ను కొనుగోలు చేశారు. అధికారులు షణ్ముగం, సురేంద్ర బాబు, ఈవో ఎస్.అయప్పన్, మహిళా రైతులు పాల్గొన్నారు.

'ఉద్యోగి భవిష్యత్తుకు యూపీఎస్ విధానంతో చేటు'

తిరుపతి(వైద్యం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే ఉద్యోగులందరూ యూపీఎస్ పరిధిలోకి వచ్చేలా కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్)ను అమలు చేయడం దారుణమని ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ చీర్ల కిరణ్ అన్నారు. ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలతో కలిసి ఆయన మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ... ఈ విధానాన్ని రద్దు చేసి పాత సీపీఎస్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘ నేతలు భరత్, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.







'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ తిరుపతి జీవకోనలో మంగళవారం ఉదయం నిర్వహించిన సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చి స్థానికంగా మురికికాలువను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య - సదస్సులో సచివాలయ సిబ్బందిని జీవకోన ప్రజలకు పరిచయం చేస్తున్న కమిషనర్ మౌర్య- సదస్సులో ఆంధ్రజ్యోతి దినపత్రికను చదువుతున్న మహిళలు

గిన్నీస్‌రికార్డు క్రీడాకారిణికి సన్మానం


వసంతలక్ష్మిని అభినందిస్తున్న శాప్‌చైర్మన్

తిరుపతి(క్రీడలు), జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో మంగళవారం శాప్‌చైర్మన్ రవినాయుడు యోగాలో గిన్నీస్ రికార్డు సాధించిన వెంకటగిరికి చెందిన సి.హెచ్.వసంతలక్ష్మిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆమె శాప్‌చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలసి తాను యోగాలో 3.42గంటల పాటు వేసిన 'సమకోణాసనం'తో తన పేరు గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఇటీవల ఢిల్లీలో జరిగిన ఖోఖో తొలి ప్రపంచకప్‌లో ఇండియా తరపున రెఫరీగా వ్యవహరించిన ఎస్.సురేష్‌కుమార్‌ను కూడా అభినందించి సన్మానించారు. తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీ, కోచ్‌లు పాల్గొన్నారు.

తిరుపతి

రౌడీలకు కౌన్సెలింగ్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీలకు తావులేదు... మద్యం సేవించి కొట్లాటలు, గలాటలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. మంగళవారం నగరంలోని రౌడీషీటర్లకు సీఐలు రామకృష్ణ, మురళీమోహన్, రాంకిషోర్ నేతృత్వంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి వుండాలని అన్నారు. అనంతరం రౌడీషీటర్ల అడ్రస్‌లు, ఆధార్ నెంబర్లు తీసుకున్నారు. సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గోరక్ష మహా పాదయాత్రకు ఘన స్వాగతం


పాదయాత్రలో గోమాత, బాలకృష్ణ గురుస్వామితో మహిళలు

తిరుపతి(విద్య), జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తలపెట్టిన గోరక్ష మహా పాదయాత్రకు మహిళలు ఘన స్వాగతం పలికారు. గోరక్షణ, భూరక్షణ, దేశ రక్షణార్థం అఖిలభారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్ సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి చేస్తున్న మహాపాదయాత్ర తిరుపతికి చేరింది. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కరకంబాడి మార్గంలోని బొంతాలమ్మ ఆలయంవద్ద రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్‌రాజు పాదయాత్రకు ఆహ్వానం పలికారు. అనంతరం అలిపిరి వరకు పాదయాత్ర సాగుతండగా.. మహిళలు కపిలతీర్థం నంది సర్కిల్ వద్ద గోమాతకు హారతులు పట్టి ప్రదక్షిణలు చేశారు. తర్వాత అలిపిరి వరకు పాదయాత్ర చేశారు. బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ... భూరక్షణ, దేశ రక్షణ గోరక్షణతోనే సాధ్యమని దేశ ప్రజలకు తెలియజేసి, గోమాత పరిరక్షణపట్ల ప్రజల్లో ప్రేరణ కల్పించాలనే ఆశయంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మహాపాదయాత్రను తలపెట్టినట్టు చెప్పారు.

బాలయ్య అభిమానుల బైక్ ర్యాలీ

● పద్మభూషణ్ రావడంపై అభినందన వేడుక


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, సుగుణమ్మ, రవినాయుడు

తిరుపతి(జీవకోన)/తిరుపతి అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కళారంగంలో నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంతో బాలయ్య అభిమానులు మంగళవారం తిరుపతిలో అభినందన వేడుక నిర్వహించారు. అభిమానులంతా తిరుచానూరు వద్ద గల మ్యాంగో మండీ నుంచి కపిలతీర్థం నంది సర్కిల్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన అభినందన వేడుకకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మలు హాజరయ్యారు. అనంతరం అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు దంపూరు భాస్కర్ యాదవ్, మహేష్‌యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, అభిమాన సంఘ నాయకులు మనోహర్‌రెడ్డి, కేపీ చౌదరి, మదన్‌మోహన్, రవితేజ, పరశురామ్, షఫీ, రామచంద్ర, అభిమానులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

● ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని


బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

తిరుపతి (రవాణా), జనవరి 28(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణానికి రక్షణ కలుగుతుందని తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్‌ధారణపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వాహన దారులు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్‌ను తప్పక ధరించాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ కృష్ణవేణి, జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీని డీటీవో మురళీమోహన్ జెండాఊపి ప్రారంభించగా, ఎస్వీ యూనివర్శిటీనుంచి అలిపిరివరకు కొనసాగింది. ఎమ్మెల్యేలు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాన్ని నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, స్వర్ణలత, ప్రసాద్‌వర్మ, వెంకటరమణనాయక్, ఆంజనేయప్రసాద్, నాయకులు రాజారెడ్డి, బాబ్జి, వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.





సంస్కృత వర్సిటీ అభివృద్ధికి కృషి

- భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జనవరి28(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ అభివృద్ధికి టీటీడీ కట్టుబడి ఉందని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. వైఖానస, పాంచరాత్ర, శైవ అర్చకులకు అర్చన అంశంపై సంస్కృత వర్సిటీలో మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వేద శాస్త్ర, ఆగమాల పరిరక్షణకు టీటీడీ కట్టుబడి పనిచేస్తుందన్నారు. వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఆగమ విభాగం తమ వర్సిటీలో ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచిందన్నారు. చావలి పవన్ వంశీశ్రీ సంకలనం చేసిన బోధాయన సూత్ర శ్రాద్ధ ప్రయోగం గ్రంథాన్ని ఆవిష్కరించారు. చెన్నైకి చెందిన శైవాగమ విద్వాంసులు ఆచార్య సమశేఖర్, ఆగమ విభాగాధిపతి ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు, ఆచార్య రజనీకాంత్ శుక్లా, డాక్టర్ రంగరామానుజాచార్యులు,నల్లకూర్మన్న భట్టాచార్యులు, కె.మోహన్, హరిమరపంత్, వెంకట పెరుమాళ్ దీక్షితులను సత్కరించారు. ఈ వర్క్‌షాప్‌కు 40 మంది ప్రతినిధులు హాజరయ్యారు.





స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఈఈగా రవి

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఆర్.రవి నియమితులు కానున్నారు. పంచాయతీరాజ్ శాఖలో ఈఈగా పనిచేస్తూ సెలవులో వున్న ఆయనను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు బదిలీ చేస్తూ ఆ శాఖలో ప్రస్తుతం ఖాళీగా వున్న తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఈఈ పోస్టులో నియమించాలని ఆదేశించింది. ఆ పోస్టులో ఆయన ఏడాదిపాటుకొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీటీడీ స్థలంలో పారిశుధ్య చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీదేవి కాంప్లెక్సులో ఖాళీగా వున్న టీటీడీ స్థలం నిత్యం మందుబాబులు, పేకాట రాయుళ్లు, వ్యభిచారానికి నిలయంగా మారింది. మంగళవారం డీఎస్పీ శ్రీలత, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బంది కలసి శ్రీదేవి కాంప్లెక్సులో గుట్టలు, గుట్టలుగా పడి వున్న మందుబాటిళ్లు, తినుబండారాలు, వ్యర్థ పదార్థాలు, పగిలిన బాటిళ్లను తీసి వేయించి శుభ్రం చేయించారు. ఆ స్థలం గేటుకు తాళం వేశారు.

స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో స్మార్ట్‌సిటీపై సమీక్షించారు. పెండింగ్‌లో, వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టు పనుల్లో పురోగతి ఉండాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈసీ ప్రతినిధులు ప్రదీప్, జమాల్, అంబర్, ఫణికుమార్, సతీష్, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, చంద్రారెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.










యువతకు ఉపాధి కల్పించండి

స్థానికంగా ఉన్న యువతకు ఉద్యోగాలు, పనులు లేక గంజాయి, మద్యం వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు కూడా జరగడం లేదు. ఇలాంటి వారికి చిన్నపాటి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారి జీవితాలతోపాటు వారి కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

- జి.మల్లిక



ఇవీ జీవకోన సమస్యలు!

- ఆంధ్రజ్యోతి సదస్సులో వినిపించిన ప్రజాస్వరం
- కమిషనర్, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజల వినతులు

తిరుపతి (వైద్యం, మంగళం), ఆంధ్రజ్యోతి

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ పిలుపునందుకుని పెద్ద సంఖ్యలో జీవకోన ప్రజలు మంగళవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సదస్సుకు హాజరయ్యారు. తిరుపతి కమిషనర్, ఎమ్మెల్యేలకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పరిష్కరించాల్సిందిగా కోరారు. వీరి సమస్యలను సావధానంగా విని, నోట్ చేసుకున్న కమిషనర్ ఎన్. మౌర్య వెంటనే పరిష్కరించగలిగిన మౌలిక సమస్యల గురించి అక్కడే మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దశాబాలుగా ఎదుర్కొంటున్న శాశ్వత సమస్యలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందించారు. పరిష్కారానికి హామీలిచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి అందజేశారు. సదస్సులో జీవకోన వాసులు నివేదించిన సమస్యలు ఇవీ...



శాశ్వత పట్టాలు ఇవ్వండి



జీవకోనలో నివసిస్తున్న వారందరికీ డీకేటీ ఇంటి పట్టాలే ఉన్నాయి. వీటికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇప్పడైనా శాశ్వత పట్టాలు ఇప్పిస్తే ఈ ప్రాంతవాసులకు భద్రత ఉంటుంది.

- సీ.సుబ్రహ్మణ్యం, స్థానికుడు

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా శ్మశానం



హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల సమాధులు ఎక్కడా లేని విధంగా జీవకోనలోని ఒకే చోట ఉన్నాయి. అయితే గంజాయి బ్యాచ్‌కి అడ్డాగా మార్చేశారు. శ్మశానాలకు కాంపౌండ్ నిర్మించి, గేట్లు ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

- మహ్మద్ రఫీ, జీవకోన

30 ఏళ్లుగా డీకేటీ లేనా?



నివాస స్థలాలకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాం 30 ఏళ్లకు పైగా నివసిస్తున్న అనేక మందికి ఇప్పటికీ ఇళ్ల పట్టాలు లేవు. కేవలం డీకేటీ పట్టాలతోనే కాలం గడుస్తోంది. అవసరానికి లోన్లు తీసుకునే వీలులేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం శాశ్వత పట్టాలను ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

- శ్రీరాములు, 48వ డివిజన్

గోవిందనగర్‌లో రోడ్లు అధ్వానం



గోవిందనగర్‌లో ఐదేళ్లుగా రోడ్ల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది.

- లక్ష్మి, గోవిందనగర్

మూడేళ్లుగా తాగునీటి సమస్య



అన్నమయ్యనగర్, రాఘవేంద్ర నగర్ ప్రాంతాల్లో మూడేళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్నాం. క్రమం తప్పకుండా నీటి పన్నులు కట్టించుకుంటున్నారు కానీ నీటిని మాత్రం సక్రమంగా సరఫరా చేయడం లేదు.

- ఎం.శకుంతల, అన్నమయ్యనగర్

కపిలతీర్థానికి రోడ్డు వేయండి



జీవకోన నుంచి కపిల తీర్థంకు వెళ్లాలంటే సత్య నారాయణపురం మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జీవకోన నుంచి ఫారెస్టు భూముల మీదుగా రోడ్డు ఏర్పాటు చేస్తే రెండు నిముషాల్లో కపిలతీర్థంకు చేరుకునే అవకాశం ఉంటుంది.

- ధర్మయ్య, ఉపసర్పంచి

చెక్‌డ్యాం కట్టండి

వానలకు తిరుమల కొండల్లోంచి వచ్చే నీటిని నిల్వ చేసేలా చెక్‌డ్యాం నిర్మిస్తే జీవకోన ప్రాంతంలో ఎటువంటి నీటి సమస్య ఉండదు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయండి.

- శ్రీనివాసయాదవ్, క్రాంతినగర్



వానపడితే రోడ్లు గుంతలవుతున్నాయి



చిన్నపాటి చినుకులు పడినా గోవిందనగర్‌లోని రోడ్లు మడుగులను తలపించేలా మారుతు న్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయంపై అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదు.

- శ్రీదేవి, గోవిందనగర్

మూడు నెలలుగా బర్త్ సర్టిఫికెట్ కోసం..



బర్త్ సర్టిఫికెట్ కోసం మూడు నెలలుగా మీసేవా, మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఎవరూ పట్టించుకోవం లేదు. ఆన్‌లైన్‌లో దేనికి నమోదు చేసుకోవాలన్నా బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్నారు.

- జి.లక్ష్మి, రాఘవేంద్రనగర్

కాలువలు శుభ్రం చేయండి



వారాల తరబడి మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తాచెదారం చేరి దుర్వాసనతోపాటు దోమల సమస్య పెరుగుతోంది. రోగాల బారిన పడాల్సి వస్తోంది. వారానికి రెండు సార్లు కాలువలను శుభ్రం చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- షాజీరా, క్రాంతినగర్

పిట్టగోడలు నిర్మించండి

భారీ కాలువలకు కనీసం పిట్టగోడలు కూడా లేకపోవడం వలన అనేక మంది ప్రమాదవశాత్తు వాటిల్లో పడి మృతిచెందుతున్నారు. ఇటీవల ఐదు మందికి పైగా ఆ కాలువల్లో పడి మరణించారు. కొంత ఎత్తుగా పిట్ట గోడను నిర్మిస్తే మంచిది.

- రామనాథం, శ్రీరామ్‌నగర్



వడమాలపేటలో స్థలం ఎందుకు?



ఇక్కడ ఉండే మాకు గతంలో ఎక్కడో వడమాలపేటలో ఒక సెంటు స్థలాన్ని ఇచ్చారు. కానీ ఆ స్థలానికి సరైన హద్దులు కూడా చూపలేదు. దానిని రద్దు చేసి మాకు అనువుగా సమీపంలో కనీసం రెండు సెంట్ల స్థలాన్ని ఇప్పించాలని కోరుతున్నాను.

-పార్వతి, సత్యనారాయణపురం

జేఎల్‌నగర్‌లో ఆకతాయిలు



జేఎల్‌నగర్‌లోని గుడి, బడి ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు విచ్చలవిడిగా గంజాయి తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇక్కడ ఎక్కువగా వికలాంగులు, లెప్రసీ బాధితులు ఉన్నారు. వీరికి సరైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాలని కోరుతున్నా.

- చిరంజీవి, జేఎల్‌నగర్

కుక్కల బెడద



జీవకోనలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బయట ఆడుకునే చిన్నపిల్లల మీద కూడా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. అలాగే రాత్రిళ్లు కొందరు ఆకతాయిలు మద్యం తాగి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ అల్లరి చేస్తున్నారు.

- శ్యామల, జీవకోన

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించండి



సత్యనారాయణపురం సర్కిల్ నుంచి అమెరికన్ బార్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల మేర ఆక్రమణకు గురై ఉంది. 40 అడుగుల రోడ్డు 20 అడుగులకే పరిమితమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. స్కూళ్ల వాహనాలు వచ్చి వెళ్లే సమయాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది.

- సుబ్రహ్మణ్యం నాయుడు, జీవకోన

పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థే

జీవకోనలో పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిలో నాలుగైదు డ్రైన్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ఎత్తు, పల్లాలు ఉండడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకించి లెప్రసీకాలనీలో సమస్యలను పరిష్కరించాలి. ఈ ప్రాంతంలో ఎక్కువగా పేదలు, కూలీలు నివశిస్తున్నారు. సొంతస్థలం ఉన్నవారికి పీఎంఏవై పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద పేదలందరికీ ఇంటిస్థలంతోపాటు ఇళ్లు మంజూరు చేయాలి. ఈప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే సహాయ, సహకారాలు అందించాలి.



- అన్నా సంధ్య, 49వ డివిజన్ కార్పొరేటర్

టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేయాలి



నీటి సమస్య ఎక్కువగా ఉంది. తిరుమలనుంచి ఈ ప్రాంతానికి నీళ్లు వస్తున్నా సమస్య తీరడంలేదు. ఇక్కడ తెగిపోయిన కోన ఉండేదని, నది ప్రవహించేదని మాపెద్దలు చెప్పేవారు. దీనిని పునరుద్ధరించాలి.ఇది తిరుపతికి ఇంకు డుగుంతగా ఉంటుంది. మున్సిపల్ టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేసి నీటి సమస్యను పరిష్కరించాలి. సత్యనారాయణపురం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కానిస్టేబుల్‌ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అలాగే పోలీస్ అవుట్‌పోస్ట్‌ని ఏర్పాటు చేయాలి. ఓపెన్ డ్రైన్స్ ఉండడం వల్ల చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. జరిమానాలు విధించడం.. ప్రజలను చైతన్యవంతులను చేయడం వల్ల కొంతవరకు నియంత్రించొచ్చు. దీంతో నగర బ్యూటిఫికేషన్‌కి అవకాశం ఏర్పడుతుంది.

- అన్నా అనిత, 48వ డివిజన్ కార్పొరేటర్

గంజాయి, డ్రగ్స్‌ని నియంత్రించాలి



ఇక్కడి వాటర్‌హెడ్ ట్యాంక్, శ్మశానవాటిక గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారికి అడ్డాగా మారాయి. అటువైపు మహిళలు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించాలి. పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి. ఇక్కడ నిరుపేదలు ఉంటున్నారు. ఇద్దరేసి కలిసి వాటాలు వేసుకుని 10-15 అంకణాలు కొని, స్థలాన్ని రెండుగా చేసుకుని చిన్నపాటి ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒకేపన్ను రశీదు ఇస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీలోని ఏడున్నర అంకణానికి పన్ను రశీదు మార్చకపోవడంతో ఇళ్లు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చూపుతున్న చొరవ అభినందనీయం.

- పి.కుమారమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

కాలువల్లో కాంక్రీట్ తొలగించండి



తిరుమల కొండల్లోంచి వచ్చే వాననీరు మాల్వాడిగుండం మీదుగా జీవకోనకు చేరుతాయి. ఈ కాలువల్లో కాంక్రీట్ ఫ్లోర్ ఏర్పాటు చేయడం వలన భూమిలో ఇంకడంలేదు. దీనివల్ల భూగర్భజలాలు పెరగవు. కాలువల్లో సిమెంటు ఫ్లోరింగ్ తొలగించడం అవసరం.

- ప్రకాష్, జీవకోన

కాలువలు శుభ్రం చేయండి



కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వలన దోమలు ఉత్పన్నమవుతున్నాయి. వారంలో ఒకసారైనా కాలువలను శుభ్రం చేయిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- జయచంద్రనాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపల్, జీవకోన

పొలాల్లో గొలుసు దొంగల హల్‌చల్

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోనే కాదు పల్లెలకూ చైన్ స్నాచింగ్ పాకుతోంది. జిల్లాలో ఒక్క మంగళవారమే రెండు చోట్ల ఈ తరహా చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం కస్తూరికండ్రిగకు చెందిన చిన్ని ఉదయం పొలంలో ఆవు పాలు పితుకుతున్నారు. అదే సమయంలో మంకీక్యాంపు ధరించిన ఇద్దరు వచ్చి మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసు, పుస్తెలు లాక్కెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్‌చౌదరి తెలిపారు. పుత్తూరు అర్బన్ పరిధిలోని వీరపురెడ్డిపాళెం వద్ద వృద్ధ దంపతులు పొలం వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. మంకీ క్యాప్ ధరించిన వ్యక్తులు ఆ మహిళా రైతు వద్దకు వచ్చి నీరు అడిగారు. నీరు ఇచ్చే సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో గొలుసులో కొంతభాగం ఆమె చేతికి చిక్కింది. మిగిలిన భాగాన్ని దొంగలు తీసుకుపోయారని పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

రసకందాయంలో కార్పొరేషన్ రాజకీయం

- డిప్యూటీ మేయర్ వైసీపీ అభ్యర్థిగా శేఖర్ రెడ్డి!
- కూటమితో టచ్‌లో ఆ పార్టీ కార్పొరేటర్లు
- రెండు రోజుల్లో కూటమి అభ్యర్థి ఎంపిక

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయరు ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ ఇవ్వడంతో తిరుపతి కార్పొరేషన్ రాజకీయం రసకందాయంగా మారింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ ఎం.శేఖర్ రెడ్డిని ప్రకటించినట్టు తెలిసింది. ఈ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు పెద్దఎత్తున డుమ్మాకొట్టినట్టు సమాచారం. కౌన్సిల్లో పాలకపక్షంగా ఉన్న వైసీపీకి సొంత పార్టీ కార్పొరేటర్లే తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 3న పరోక్ష పద్ధతిలో జరగనున్న ఎన్నికలకు ముందు క్యాంప్ రాజకీయాలకు తెరలేపనున్నట్టు సమాచారం. సమావేశానికి హాజరుకానివారిని స్థానిక వైసీపీ నాయకత్వం ఇప్పటికే గట్టిగా హెచ్చరికలు జారీచేసినట్టు తెలుస్తోంది. అవన్నీ పట్టించుకోకుండా కూటమి పార్టీ నేతలతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోవైపు, కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తివున్న కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడినట్టు తెలుస్తోంది. నేడో, రేపో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి వస్తున్నట్టు సమాచారం. ఈలోపు కూటమిలో చేరేందుకు ఆసక్తి ఉన్న కార్పొరేటర్లతో పాటు ప్రస్తుతం వైసీపీతో అసమ్మతిగా ఉన్నవారిని ఏకం చేసి మంత్రి సమక్షంలో కూటమిలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పుడే కూటమి నుంచి డిప్యూటీ మేయర్‌ను ఎవరిని నిలబెట్టాలనే నిర్ణయాన్నీ తీసుకోనున్నారు. మొత్తానికి రాబోయే ఐదురోజుల పాటు తిరుపతి రాజకీయం రంజుగా ఉండబోతోంది.

అందుబాటులోకి ఛార్జింగ్ స్టేషన్

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో టీటీడీ వాహనాలకు విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. పది విద్యుత్ బస్సుల(ధర్మరథాలు)తో పాటు 35 కార్లు తదితరాలున్నాయి. వీటికి ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలోనే ఛార్జింగ్ పెడుతున్నారు. వాహనాల సంఖ్య పెరగడంతో ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మంగళ, బుధవారాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించి.. ఫిబ్రవరి మొదటివారం నుంచి పూర్తిగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

పీజీ అడ్మిషన్ల బాధ్యత వర్సిటీలకే అప్పగించాలి: ఎస్ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పీజీ అడ్మిషన్ల నిర్వహణ బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలని ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండు చేశారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఈ దిశగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకోవాలని కోరారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ మాజీ నేత వందవాసి నాగరాజు మాట్లాడారు. తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అక్బర్, రవి, కార్యవర్గ సభ్యులుగా ఉమేష్, ప్రవల్లిక, బాల, తేజ, గురవయ్య, వినోద్, అశోక్‌ను ఎన్నుకున్నారు.

'డిజిటల్ అరెస్టు' మోసంలో మరో ఆరుగురి అరెస్టు

రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



ల్యాప్‌టాప్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరిట తిరుపతిలోని మహిళను మోసం చేసిన కేసులో మరో ఆరుగురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.32.5 లక్షలు, నగలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అరెస్టయిన నిందితుడిని విచారించడంతో ఈ ఆరుగురి విషయం బయటపడింది. ఈ వివరాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. విశాఖపట్నం త్రినాథపురానికి చెందిన సింగంపల్లి గణేష్, చిన్నవాల్తేరుకు చెందిన పాలకొల్లు రవికుమార్, కంచరపాలేనికి చెందిన యల్లి జగదీష్, రామ్‌నగర్‌కు చెందిన ఆనంద్ సంతోష్‌కుమార్, పెందుర్తి మండలం ఎల్ఐసీ కాలనీకి చెందిన అమరనాథ్, మురళినగర్‌కు చెందిన కర్రి వాసుదేవ్ స్నేహితులు. కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ ఈజీ మనీకోసం పలువురిని మోసం చేసేవారు. ఇలా.. తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో ఫోను, వాట్సాప్ కాల్ చేశారు. తాము ఢిల్లీకి చెందిన సీబీఐ అధికారులమని, రూ.200 కోట్లు మనీ ల్యాండరింగ్.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు వినియోగించడంపై అరెస్టు చేయాల్సి ఉంటుందని బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు తమకు పంపితే వాటిని పరిశీలించి మనీ ల్యాండరింగ్‌లో మీ పాత్ర లేకుంటే తిరిగి జమ చేస్తామని చెప్పారు. దీంతో ఆమె తన ఐదు ఖాతాల్లోని రూ.2.5 కోట్లను వారు చెప్పిన ఖాతాలకు పంపారు. దీనిపై వారు మళ్లీ స్పందించకపోవడంతో ఈ నెల 13న తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన వినయ్‌కుమార్‌ను ఈనెల 22న అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఆరుగురు ఉన్నట్లు అతడు చెప్పడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు పర్యవేక్షణలో సైబర్ క్రైం సీఐ వినోద్, క్రైం.. వెస్ట్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సెల్ టవర్ ఆధారంగా నిందితులను పట్టుకుని అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. వారి నుంచి రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారు నగలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్ టాప్‌లు, ఒక సిమ్ మాడ్యూల్స్, ఎనిమిది రూటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఓ నిందితుడి ఖాతాలోని రూ.10 లక్షలను ఫ్రీజ్ చేశారు. వీరంతా కంబోడియా వెళ్లి సైబర్ నేరాలపై శిక్షణ పొంది వచ్చినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రతిభ చూపిన వెస్ట్ సీఐ మురళీమోహన్, సైబర్ క్రైం సీఐ వినోద్, సీసీఎస్‌సీఐ ప్రకాష్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ శ్రీలత, సీఐలు, వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పుత్తూరు, నారాయణవనం మండలాల్లో రెండు మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్

- ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

పుత్తూరు అర్బన్, జనవరి27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన మేరకు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపున కు నోటిఫికేషన్ జారీ అయ్యిందని పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. పుత్తూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో రెండు దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పుత్తూరు మున్సిపాలిటీపరిధిలో గౌడ కులస్తులు, నారాయణవనం మండలంలో ఈడిగ కులస్తులు అర్హులని తెలిపారు. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ బ్యాంక్ చలానా/డీడీని సమర్పించాల్సి ఉంటుందన్నారు. అంతే కాకుండా తహసీల్దార్ ధృవీకరించిన నివాస, కుల సర్టిఫికెట్లను జతచేయాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పుత్తూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న ఆయా కులస్తులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు.

ఉన్నత విద్య, ఉద్యోగంపై విద్యార్థులకు అవగాహన


సమగ్ర సమాచార పుస్తకాలతో విద్యార్థులు

పుత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య, ఉద్యోగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలోని కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. వే ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ అంకయ్య, జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రత్నకిషోర్... ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. కళాశాలలో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.లక్ష విలువైన కోచింగ్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల సమగ్ర సమాచారం కలిగిన పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

2న షిర్డీ సాయి కల్యాణ మండపం ప్రారంభం

పుత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీ సాయిబాబా నిత్యాన్నదాన సాంఘిక సేవా సమాజం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణమండ పాన్ని ఫిబ్రవరి 2న ఆదివారం ప్రారంభిస్తామని సమాజం నిర్వాహకులు తెలిపారు. భక్తులు అందించిన విరాళాలతో ఈ భవనాన్ని బైపాస్ రోడ్డులో ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట నిర్మించారు. ఈ భవన ఆవరణలో వృద్ధాశ్రమాన్ని నిర్మించనున్నామని తెలిపారు.

అజయ్ కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం



వడమాలపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనమలపాలెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు అజయ్ సాయి కుటుంబానికి జనసేన పార్టీ రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. అజయ్ సాయి గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్... అజయ్ సాయి తండ్రికి చెక్కును జనసేన పార్టీ మంగళగిరి కార్యలయంలో అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో రేణిగుంట మండలం కుక్కలదొడ్డి వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... రాజంపేటకు చెందిన ఓ కుటుంబం చెన్నై విమానాశ్రయానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని కుక్కలదొడ్డి వద్ద ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ కారును రోడ్డుపక్కన నిలిపి వెంటనే వాహనం నుంచి అందరూ దిగేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరువా వితరణ



గూడూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సైదాపురం మండలంలోని ఆర్ఆర్‌పురం గ్రామానికి చెందిన చందన అనే మహిళకు మంగళవారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయం వద్ద బలిజ మహిళా సంక్షేమసంఘం ఆధ్వర్యంలో బీరువాను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బలిజ మహిళాసంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పేదరాలైన చందన వివాహానికి తమ సంఘం ఆధ్వర్యంలో బీరువాను వితరణగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సారంగం సులక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

5లోగా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ప్రసాద్

వాకాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వాకాడు సర్కిల్ పరిధిలోని కల్లుగీత కార్మికుల నుంచి 2 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ మంగళవారం తెలియజేశారు. వాకాడు, చిట్టమూరు మండలాలకు ఒకటి చొప్పున దుకాణాలను కలెక్టర్ కేటాయించారన్నారు. వాకాడుకి గౌండ్ల ఉపకులం వారికి, చిట్టమూరు మండలానికి గౌడ్ ఉపకులానికి కేటాయించినట్లు వివరించారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఆటవస్తువులు, వంట సామగ్రి పంపిణీ


వస్తు, సామగ్రి అందజేస్తున్న గాలి రమేష్ నాయుడు-జయప్రద దంపతులు

నాయుడుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట సప్తగిరికట్ట వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రానికి టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ గాలి రామేష్ నాయుడు-జయప్రద దంపతులు వస్తుసామాగ్రిని మంగళవారం అందజేశారు. వారి కుమారుడు లిఖిత్ జన్మదినం సందర్భంగా చిన్నారుల నడుమ కేక్ కట్‌చేసి వారికి పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు, పలకలు, ఆట వస్తువులు, వంటసామగ్రి తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి రాజేష్ నాయుడు, ఉత్తమ మాజీ రాష్ట్ర ఉపాధ్యాయుడు మలిశెట్టి శివప్రసాద్, అద్దూరు రవి, శిరసనంబేటి గౌతం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రూ.కోటి మంజూరు

అడిగిందేమో రూ.6.12 కోట్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్వల్పమొత్తంలో నిధులు మంజూరు చేసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు రూ.6.12 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం గతేడాది నవంబరులోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఉత్సవాలు ముగిశాక ఇపుడు ప్రభుత్వం కేవలం రూ. కోటి మాత్రమే మంజూరు చేసింది.

ఆటోల్లో ఓవర్ లోడింగ్ వద్దు : ఎస్ఐ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, జనవరి 28 : (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణికులు సీటు బెల్టు పెట్టుకోవాలని, స్కూలు ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను తరలించ రాదని ఎస్ఐ శివశంకర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డక్కిలిలోని కాకతీయ జూనియర్ కాలేజీ విద్యార్థులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

30న జాబ్‌మేళా

దొరవారిసత్రం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీన దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైకెన్ ఎయిర్ కండిషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడ్‌అప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు అర్హులని వివరించారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేద్దాం

గూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు బీవీరమణయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆస్పత్రి రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పెంచలయ్య, కిరణ్, శ్రీకాంత్, సురేంద్ర, ప్రశాంత్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మందులు పిచికారి చేయాలి


తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ నాగార్జున సాగర్

డక్కిలి, జనవరి 28 : (ఆంధ్రజ్యోతి) : తెగుళ్ల నివారణకు రైతులు సకాలంలో క్రిమిసంహారక మందులు పిచికారి చేసుకోవాలని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాటుమడుగు, శ్రీపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పంటలు సాగుపై అవగాహన కల్పించారు. డక్కిలి ఏవో విజయభారతి ఉన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి


పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణలో పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ ఏడీ ధనుంజయులు తెలిపారు. మండలంలోని జీలపాటూరు పంచాయతీ దొడ్లవారిమిట్ట గ్రామంలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. నట్టల నివారణ మందులు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. ఎల్ఎస్‌ఏ బాలాజీ, విజయ, పశుసంవర్ధక సహాయకులు మిట్ట లతవ్యకుమార్, ప్రేమ్‌కుమార్, ప్రభావతి, నికోరాణి తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలో మంగళవారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. చెన్నైవైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఖరగ్పూర్ సూపర్ ఫాస్ట్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు తెలిసింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే విజయశ్రీ


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే కమిటీ సభ్యులు సతీష్, హనుమంతరావు, సరిత

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి హెచ్‌డీసీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సభ్యులుగా వై.సతీష్, హనుమంతరావు, సరితలను ఎన్నుకొన్నారు. హెచ్‌డీసీ కమిటిచే ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, ఎంపీడీవో ప్రమీలా రాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన హెచ్‌డీసీ కమిటీని ఆస్పత్రి వైద్యబృందం, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, గాడి నారాయణరెడ్డి, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైన పెన్షనర్లకు వైద్య పరీక్షలు


నాయుడుపేటలో పింఛన్ దారులను పరీక్షిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంచానికి పరిమితమైన పింఛన్ దారుల ఇళ్ల వద్దకే వెళ్లి సదరన్ టీమ్ వైద్యులు మంగళవారం పరీక్షలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మంచానికి పరిమితమైన పింఛన్ దారులు 27 మంది ఉండగా వారిలో 21 మందికి వైద్య పరీక్షలు చేశారు. రూరల్ మండలంలో 16 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య పరీక్షల నివేదికలను జిల్లా డీఎం అండ్ హెచ్‌వోకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సీహెచ్ మధుసూదన్‌రావు, డాక్టర్ వెన్నెల, ఎల్ఏసాగరం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుబ్బారావు, గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు.

వాకాడు: మండల వ్యాప్తంగా ఉన్న 12 మంది పెన్షనర్లను జిల్లా వైద్యాధికారులు పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, బాలిరెడ్డిపాళెం వైద్యాధికారి దీప్తి ఉన్నారు.

ఉల్లాసంగా.. అక్షరజ్ఞానం


పుస్తకాలు చూపెడుతున్న అధికారులు

వాకాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అన్నపూర్ణరావు అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో 37 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో వయోజన విద్య కార్యక్రమంలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం గురించి వివరించారన్నారు. ప్రస్తుతం ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, కుటుంబసంక్షేమం, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి ప్రాథమిక విద్య, కలలు, శాస్త్రాలు, సాంకేతికత, సంస్కృతి, క్రీడలు, తదితరాలపై అవగాహన పెంచనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాధవి, సీసీలు రమణమ్మ, భూదేవి, సరోజనమ్మ, కృష్ణ, గున్నయ్య తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల్లో కార్పొరేట్ విద్యపై ప్రచారం చేయాలి


అంగన్వాడీ వర్కర్లకు మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు బోధిస్తున్న కార్పొరేట్‌స్థాయి విద్యపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోటలోని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మెడికల్ కిట్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఆయా మండలాల్లో 225 అంగన్వాడీ కేంద్రాలకు వర్కర్లకు మెడికల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మజ ఉన్నారు.

జాతీయ రహదారిపై ఎల్ఈడీ వెలుగుల శోభ


చిల్లకూరు వద్ద హైవే మీద కాంతులీనుతున్న ఎల్ఈడీ లైట్లు

పెళ్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-రేణిగుంట మధ్య జాతీయ రహదారి అండర్ బ్రిడ్జిలపై ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. తాళ్వాయిపాడు గోమతిసర్కిల్ నుంచి నెలబల్లి వరకు ఈ విద్యుత్ దీపాలు ఆకర్షణీయంగా వెలుగులు ఇస్తున్నాయి. గతంలో రెండు వరుసల రహదారి ఉండటంతో అనేక ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలుగా విస్తరించారు. తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, భీమవరం, నెలబల్లి గ్రామాల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలపై ఎల్ఈడీ లైట్‌ల ఏర్పాటుతో వాహనదారులు సాఫీగా సాగుతూ గమ్యస్థానాన్ని చేరుకుంటున్నారు. కాగా అక్కగారిపేట, పెసల గుర్రప్పతోట వద్ద సర్వీస్ రోడ్డులు ఏర్పాటు చేయకపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి అథారిటీ అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యరూపం దాల్చని సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం


విద్యానగర్, చెందోడు గ్రామాల వ్యూ

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చెందోడు పంచాయతీ మజరాలోని విద్యానగర్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యాసంస్థలకు కేరాఫ్‌గా ఉన్న ఈ ప్రాంతం అటు చిట్టమూరు, నాయుడుపేట, వాకాడు, చిల్లకూరు మండలాలకు ప్రధాన కూడలి. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమల్లో పనిచేసే మహిళలు, విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకొని ఆయా ప్రాంతాలకు వెళ్తుంటారు. పలు మండలాల నుంచి పిల్లలు విద్యాభ్యాసం కోసం ఈ ప్రాంతంలో ఉంటున్నారు. ఇక్కడ మహిళల అవస్థలను దృష్టిలో పెట్టుకుని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆత్మగౌరవం పేరుతో సులభ్ కాంప్లెక్స్‌లు, మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించింది. స్వచ్ఛంద సంస్థలకు ఈ కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యత అప్పగించాలని అప్పటి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రతిపాదించారు. అయినా ఇప్పటివరకు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. మరుగులేక మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే స్పందించి విద్యానగర్‌లో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలని వీరు కోరుతున్నారు.

మంచు..ముసుగు

కొక్కుపాడు సమీపంలో 9 గంటల వరకు విడవని పొగమంచు



వంజివాక సమీపంలో వరి పైరుపై ఇలా దట్టంగా కమ్ముకున్న మంచు



కోటతో పాటు పరిసర గ్రామాలను మంగళవారం మంచు కమ్మేసింది. వంజివాక, తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు, తిన్నెలపూడి గ్రామాల్లో ఉన్న వరి పొలాలను మంచు కమ్మేసింది. ఉదయాన్నే కూలి పనులకు వెళ్లే వారు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా కోట, కొత్తపట్నంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మంచు ముసుగేసింది. వాహన దారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. 9 గంటలపైన సూర్యుడు రావడంతో జనం వెచ్చబడ్డారు.

- కోట

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగరాదు



నాయుడుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాలలో మద్యం తాగడం నిషేధమని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. మంగళవారం నాయుడుపేట, పరిసర ప్రాంతాలలో బహిరంగ, మారుమూల ప్రాంతాలలో మద్యపానం నిషేదం సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆయన వెంట అర్బన్ సీఐ బాబి తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

తడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు. మంగళవారం తడకండ్రిగ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్‌లోని తప్పులు, చిరునామా మార్పు, కొత్తగా నమోదు వంటి సేవలు అందుతాయని వివరించారు.

విన్నమాలలో తాగునీటి బోరు ఏర్పాటు

నాయుడుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఎస్టీ కాలనీలో నీటి సమస్య ఉండటంతో మంగళవారం టీడీపీ నాయకులు తాగునీటి బోరు పనులు ప్రారంభించారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, విన్నమాలలో తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ తాగునీటి కోసం నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి దార్ల రాజేంద్ర, టీడీపీ నాయకులు మధురెడ్డి, రాజారెడ్డి, బత్తల దినేష్, శ్రీనివాసులు, శేఖర్, నాగరత్నం, బంగారయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను పేదలకు అందించండి

పెళ్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పేదలకు అందించాలని ఎస్సీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చిల్లకూరు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ ఇచ్చిన హామీలను అమలుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు కరణం రఘునాయుడు, ఎల్లు మోహన్, తూముల కోటి, సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల కృష్ణయ్య, గోపాల్, దయాకర్, శ్రీనివాస్‌రాజు, అశోక్, రమణయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపుపై ఆందోళన

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్లపేరుతో స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ కోటలోని తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట తిన్నెలపూడి పంచాయతీ ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని తహసీల్దారు జయజయ రావుకు, ఎంపీడీవో వేణుకు వినతిపత్రం అందజేశారు. ఇసుక తరలింపునకు పంచాయతీ కార్యదర్శి ఎలా అనుమతులు ఇస్తారని గ్రామస్తులు ఎంపీడీవోను ప్రశ్నించారు. ఇకనుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కారు ఢీకొని అపెక్స్ ఉద్యోగి మృతి

చిల్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోట క్రాస్ రోడ్డు సమీపంలో కారు ఢీకొని అపెక్స్ పరిశ్రమ ఉద్యోగి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదేశ్ (50) కోట క్రాస్‌రోడ్డు సమీపంలోని అపెక్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున విధులు ముగించుకుని రోడ్డు దాటు తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెలుతున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు నిర్మాణంపై విచారణ


● నోటీసులు జారీ చేసిన తహసీల్దారు

రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్‌కు ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు నిర్మాణంపై విచారణ చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణాపురం పంచాయతీలో ఉపాధి హామీ నిధులు రూ.25.7 లక్షలతో రోడ్డు నిర్మాణంపై 'ప్రైవేటు వెంచర్‌కు ప్రభుత్వ భూమిలో రోడ్డు' శీర్షికన ఈనెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన తహసీల్దారు సురేష్‌బాబు విచారణకు ఆదేశించారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, వీఆర్వో సాయి రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం రోడ్డు నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రైవేటు యాజమాన్యానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఈ విషయమై నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గడువులోపు స్పందించకుంటే రోడ్డును పగులగొట్టి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డు నిర్మాణంపై ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఈవోపీఆర్డీ ప్రభురావును విచారణాధికారిగా నియమించారు.


విద్యుత్ టవర్ కింద రోడ్డు నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ, వీఆర్వో

ఆరు నెలలుగా నిరుపయోగంగా...

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారణి సమీపంలో శ్రీకాళహస్తి - తడ రోడ్డు పక్కన ఆరు నెలలుగా విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కన పడి ఉన్నాయి. కారణి సమీపంలోని మూడు ప్రాంతాల్లో పడేశారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తు చేస్తుకోగా వారి కోసం లైన్లు లాగడానికి వీటికి తీసుకొచ్చి ఇక్కడ పడేశారు. ఇప్పటికైనా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.


కారణి వద్ద నిరుపయోగం రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు

విద్యుదాఘాతంతో నాలుగు గేదెల మృతి

శ్రీకాళహస్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందాయి.ఈ ఘటన మంగళవారం తొట్టంబేడు మండలం చిన్నకనపర్తిలో వెలుగు చూసింది. పెద్దకనపర్తి దళితవాడకు చెందిన పల్లమాల రమణయ్య గేదెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం గేదెలను సమీపంలోని చిన్నకనపర్తి వద్దకు మేతకు తోలాడు. సాయంత్రం నాలుగు గేదెలు కనబడలేదు. చీకటి పడటంతో చేసేదేమి లేక ఉన్న గేదెలతో ఇంటికి వెళ్లాడు. కనబడకుండా పోయిన నాలుగు గేదెల కోసం మంగళవారం వెతుకులాడాడు. అయితే ఓ వ్యక్తి వరి పొలంలో తన నాలుగు గేదెలు మృతి చెందినట్లు గుర్తించాడు. దీంతో రమణయ్య విలపించాడు. వ్యవసాయ భూమికి విద్యుత్ కంచె ఏర్పాటు చేయడంతో నాలుగు గేదెలు మృతి చెందినట్లు భావిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


పొలంలో మృతి చెంది పడి ఉన్న గేదెలు

నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చ

పిచ్చాటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు పలు శాఖాధిపతులను కలసి నియోజకవర్గంలోని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల వరుస తుఫాన్లకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతులు చేపట్టాలని, మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులు త్వరగా విడుదల చేయాలని కోరారు. అరణీయార్‌లో ఫిబ్రవరి 2వ తేదీ తరువాత 10 లక్షల చేప పిల్లలు వదలడానికి కలెక్టర్ అనుమతి ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని జేసీ శుభం బన్సల్‌ను కోరారు. ముడియూరు, చమర్తి కండ్రిగకు మంజూరైన రెండు సబ్‌స్టేషన్ల పూర్తి చేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు.


కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని సీఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి సీఐ బహిరంగంగా మద్యం తాగడానికి వినియోగించే ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ చెత్తాచెదారాలను శుభ్రం చేయించి బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బ్యానర్ ఏర్పాటు చేయిస్తున్న సీఐ శరత్‌చంద్ర

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. మండంలోని మేర్లపాక సమీపంలో ఉన్న డాలర్స్ కాలనీలో మంగళవారం మద్యం సీసాలను తొలగించారు.

బంగారమ్మ కాలనీలో ప్రమాదకర నిర్మాణం

భవనంలో కలిసిపోయిన విద్యుత్ స్తంభం ● పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు సాగుతున్నాయి. బంగారమ్మ కాలనీలో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభాన్ని తన ఇంట్లో కలిసిపోయేలా మిద్దెను నిర్మిస్తుండటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా కనీసం స్పందించడంలేదంటున్నారు. 11కేవీ తీగలు భవనానికి అత్యంత చేరువుగా వెళుతున్నాయి.

గతంలో జరిగిన సంఘటనలు...

శీతాలాంబ ఆలయం పక్కనే ఉన్న పోలీస్‌క్వార్టర్స్‌లో కొద్ది సంవత్సరాల క్రితం ఇంటి ఆవరణలో పిల్లలు ఆడుకుంటూ పొరబాటున విద్యుత్‌తీగలను తాకడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బీపీ అగ్రహారంలో ఓ యువకుడు ఓటేరు కాలువ ప్రాంతంలో మహిళ ఇంటిముందు ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో దుర్మరణం చెందారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ మహిళ ఇంటి వద్ద 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.


విద్యుత్ స్తంభానికి ఆనించి నిర్మించిన గోడ

వరిలో ఎలుకల నివారణపై అవగాహన

రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమండ్యంలో వరిలో ఎలుకల నివారణపై రైతులకు ఇండిగ్యాస్, పొలం బడిలో భాగంగా ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎలుకల మందును బొరియల్లో ఉంచే పద్ధతిని రైతలకు వివరించారు.

దుస్థితిలో రోడ్లు... పట్టించుకోని అధికారులు!


దుస్థితిలో ఉన్న కంచరపాళెం రహదారి - గుంతలు తేలిన గోవర్ధనపురం రహదారి - రాళ్లు తేలి కోతకు గురైన పాండూరు ప్రధాన రహదారి

వరదయ్యపాళెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఇటీవల వరుస తుఫాన్లతో కురిసిన భారీ వర్షాలకు గోవర్ధనపురం వంతెన మరింత దుస్థితికి చేరుకుంది. తూతూ మంత్రంగా మరమ్మతులు చేపడుతుండడంతో సమస్య మళ్లీ మొదటికే వస్తోంది.

అధ్వానంగా గ్రామీణ రహదారులు...

బత్తలవల్లం పంచాయతీలోని రాచకండ్రిగ - బత్తలవల్లం చెక్‌పోస్టు, బత్తలవల్లం గ్రామం వరకు రోడ్డు రాళ్లు తేలింది. ఈ మార్గం మీదుగా పరిశ్రమలకు, విద్యా సంస్థలకు వెళ్లేవారు అధిక సంఖ్యలో ఉన్నారు. తరచూ ప్రమాదాలు జరిగి గాయపడుతున్నారు. కడూరు పంచాయతీలో కడూరు క్రాస్ చెక్‌పోస్టు నుంచి వెంకటరెడ్డి కండ్రిగ, కంచరపాళెంలోని రోడ్లు గుంతలమయమైంది. యానాదివెట్టు పంచాయతీలో గత ప్రభుత్వ చర్యలు కారణంగా వలన రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. రోడ్లు ఛిద్ర మైపో వడంతో సత్యవేడు - వరదయ్యపాళెం - సూళ్లూరుపేట బస్సు రద్దు అయింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవ తీసుకుని తాత్కాలిక పరిష్కారమార్గం చూపారు. సంబంధిత అధికారులు స్పందించి మండలంలో దుస్థితికి చేరుకున్న రోడ్లను బాగు చేయాల్సి ఉంది.


ఛిద్రమైన చిన్నపాండూరు-సత్యవేడు

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

నారాయణవనం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న కోపంతో చేసిన హత్యా నేరం రుజువు కావడంతో మండలంలోని మిట్టనైనారు కండ్రిగకు చెందిన మునివేలు(42) కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటూ రూ.వెయ్యి జరిమానాను జిల్లా 10వ అడిషనల్ కోర్టు జడ్జి విధించినట్లు సీఐ రవీంద్ర తెలిపారు. మండలంలోని మిట్టనైనారు కండ్రిగలో నివాసమంటున్న మునివేలు భార్య కోమలతో అదే గ్రామానికి చెందిన షణ్ముగం ఆచ్చారి వివాహేతర సంబంధాన్ని కొనసాగించాడని అనుమానించాడు. ఈక్రమంలో 2018 అగస్టు 30న మునివేలు మండల పరిధిలోని ఎరికంబట్టు చెరువు వద్దకు షణ్ముగం ఆచ్చారికి ఫోన్ చేసి పిలిపించాడు. వచ్చిన వెంటనే షణ్ముగాన్ని కత్తితో పొడిచి హత్య చేశాడు. అయితే ఎలాంటి ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడ్డాడు. దీనిపై మృతుడి సమీప బంధువు ఆర్ముగం ఆచ్చారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ ఇద్దరు సెల్‌ఫోన్ డేటా ఆధారంగా నేరం రుజువైంది. దీంతో కేసును విచారించిన తిరుపతి 10 ఏడీజే కోర్టు నిందితుడు మునివేలుకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. విధించినట్లు వారు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా, సెల్‌పోన్ల డేటాతో నేరాన్ని రుజువు చేయడంలో కృషి చేసిన సీఐలు కొండయ్య, దైవప్రసాద్, రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్, కోర్టు కానిస్టేబుళ్లు కుప్పమందడి, మునిశంకర్‌ను కోర్టు అభినందించింది.


యావజ్జీవ శిక్ష పడిన మునివేలుతో కానిస్టేబుల్

సీసీ కెమెరాలతో పటిష్ఠ భద్రత

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో వ్యాపార కేంద్రాలకు మరింత భద్రత చేకూరుతుందని డీఎస్పీ నరసింహమూర్తి చెప్పారు. పట్టణంలో చతుర్మాడ వీధుల్లో డీఎస్పీ, 1టౌన్ సీఐ గోపి సిబ్బందితో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. నాలుగు మాడ వీధుల్లో ట్రాఫిక్ సమస్య అరికట్టేందుకు వ్యాపారులు రోడ్డులోకి చొరబడకూడదని సూచించారు. అలాగే కాలినడకన సంచరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుపై వివరించారు. కాగా అంతకు ముందు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు, సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. మద్యం సీసాలు, వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరా ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

వేడుకగా అష్టదళ పాద పద్మారాధన సేవ

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వర స్వామికి మంగళవారం అష్టదళ పాద పద్మారాధన సేవ వేడుకగా జరిగింది. ఉదయాన్నే సుప్రభాత సేవ, అష్టదళ పాద పద్మారాధన సేవ, అర్చన, వింజామర సేవలు జరిగాయి. సాయంత్రం సర్వదర్శనం, నైవేద్యం, ఊంజల్‌సేవ, ఏకాంత సేవలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకోగా తీర్థప్రసాద వినియోగం జరిగింది.



ఎంపీడీవోకి సన్మానం

పిచ్చాటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న పిచ్చాటూరు ఎంపీడీవో మహ్మద్‌రఫీని టీడీపీ మండల ఎం.తిరుమల రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పిచ్చాటూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ మనోహర్, జయచంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ద్వారకా బదరీకాశ్రమ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం బెంగళూరు జగద్గురు శంకరాచార్య సంస్థానం ద్వారకా బదరీ కాశ్రమ పీఠాధిపతి విద్యానారాయణ తీర్థ స్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి

నారాయణవనం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం కీలగరం ప్రధానోపాధ్యాయుడు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి ఉంటుందని, సమాజంలో పౌరులను తీర్చి దిద్దడానికి వారి కృషి అనిర్వచనీయమని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు వృత్తి గురించి జడ్పీటీసీ సుమన్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, గుణశేఖర్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మోటరు వైర్లు, స్టార్టర్ల చోరీ

రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీకి సంబంధించిన మోటరు వైర్లు, స్టార్టర్లు చోరీకి గురికావడంతో మంగళవారం పంచాయతీ కార్యదర్శి మణి, సర్పంచ్ నాగేశం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ... పంచాయతీ పరిధిలోని అన్నాస్వామిపల్లి, తిమ్మి నాయుడు గుంటకు వెళ్లే మార్గంలో ఆరు పంచాయతీ మోటర్లు ఉన్నాయన్నారు. ఈ మోటర్లకు ఉన్న వైర్లును, స్టార్టర్లను చోరీ చేశారని చెప్పారు. ఇప్పటికే మూడుసార్లు ఇలా చోరీ జరిగినట్లు వివరించారు. తాజాగా ఆరు మోటర్లకు ఉన్న వైర్లు, స్టార్టర్లు చోరీ అయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

తహసీల్దారు, ఎంపీడీవోలకు సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు అందుకున్న తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను టీడీపీ నాయకులు అభినందించారు. తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు వారిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. భాస్కర్ ముదిరాజ్, మణి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు

రేణిగుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నాస్వామిపల్లెలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 పశువులకు పిడుదుల మందు స్ప్రే చేశారు. 85 దూడలకు, 350 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పిచికారీ చేశారు. ప్రభుత్వ పశువైద్యులు సునీత, స్రవంతి, వీణ సిబ్బంది మునికృష్ణ, టీడీపీ నాయకులు నాదమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరిలో మంగళవారం పశు సంవర్ధకశాఖ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో పశువులకు వైద్య శిబిరం నిర్వహించారు. సహాయకులు విజయకుమార్, హేమంత్, దామోదర్ పాల్గొన్నారు.

నేడు తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం తై అమావాస్య ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు స్వామిఅమ్మవార్లను భరద్వాజ తీర్థంలోని శివాలయం వద్దకు వేంచేపు చేసి విశేష అభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నైవేద్యం, మంత్రపుష్పం, హారతులు ఇచ్చి ప్రత్యేక అలంకరణ అనంతరం స్వామి అమ్మవార్లను నాలుగు మాడవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

కేవీబీపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మృదులవాణి ఆదేశించారు. మండలంలోని ఎగువపూడి ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కుక్కకాటు, పాము కాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రానికి వచ్చే రోగులకు సేవలందిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కిశోర బాలికలను గుర్తించి వారికి శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి వాణి, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ ఉచిత పరీక్షలు

వరదయ్యపాళెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పీహెచ్‌సీ పరిధిలో బత్తలవల్లం సచివాలయం, మత్తేరిమట్ట విలేజ్ హెల్త్‌సెంటర్‌లో స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ ఉచిత పరీక్షలు నిర్వహించారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నపాండూరు మెడికల్ ఆఫీసర్ అనిత, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, చైతన్యభాను పాల్గొనగా సర్పంచులు సింధూజ, లోకేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాబ్‌మేళాకు మిశ్రమ స్పందన


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ నిర్వాహకులు

సత్యవేడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు మిశ్రమ స్పందన లభించింది. కళాశాల ప్రాంగణంలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, సిడాఫ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. ఈ జాబ్‌మేళాలో వీల్స్ ఇండియా, బ్లూస్టార్, ఏరియాస్ ఆగ్రో, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 44 మంది హాజరైనట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చైతన్య తెలిపారు. కాగా శ్రీసిటీ ఎస్టీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉద్యోగ మేళా జరిగింది. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు మోనీషా, రాజశేఖర్, జానకిరాం, మధు, నాగూరయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్, ప్లేస్‌మెంట్ అధికారి హన్న తదితరులు పాల్గొన్నారు.